క్లుప్తంగా

21 నుంచి విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

మండవల్లి: మండలంలోని లింగాలలోని శ్రీగంగా విశాలాక్షి సమేత శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి దివ్య లీలా కల్యాణ మహోత్సవాలు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహణాధికారి కొవ్వాడ దివ్యశ్రీ శనివారం తెలిపారు. 21న స్వామిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లికుమార్తెను చేస్తారని పేర్కొన్నారు. 22న శ్రీగంగా విశాలాక్షి సమేత శ్రీ విశ్వేశ్వర స్వామివారి దివ్య లీలా కల్యాణం, 23న గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణ మహోత్సవాల్లో యాజ్ఞికులుగా శ్రీమాన్ కాశీవరప్రసాద్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

పమిడిముక్కల: మండలంలోని రైతులు, కౌలు రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. మండలానికి 250 క్వింటాళ్లు వచ్చాయని, రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. విత్తనాలు కేజీ ధర రూ.88 కాగా సబ్సిడీ పోను రూ.44కు ఇస్తున్నామని తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం తీసుకురావాలని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

పమిడిముక్కల: ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శనివారం వివరించారు. ఏ ప్రాంతంలో కూడా నలుగురు కన్నా ఎక్కువ మంది ఒక చోట గుమికూడి ఉండరాదని తెలిపారు. ముందస్తు అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులను, కార్యకర్తలను రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేయటం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వదంతులు పెట్టి ప్రచారం చేయడం నేరమని తెలిపారు. ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో జీవనం సాగించాలని కోరారు.

విద్యార్థుల పుస్తక పఠనం



ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో శనివారం పుస్తక పఠనం చేయించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి విద్యార్థులతో పలురకాల నీతికథలతో కూడిన పుస్తకాలను చదివించారు. ఇందుకు సంబంధించి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, చిరుకానుకలు అందజేశారు.

భక్తిప్రపత్తులతో రుద్రాభిషేకాలు

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం లింగాకారుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం ఉత్సవామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ రాజ్యలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన జరిపారు. అనంతరం మూలమూర్తికి పంచామృతాభిషేకం చేసి బిల్వ పత్రాలతో అర్చన చేశారు. హోమక్రతువును కనుల పండువగా జరిపారు. రాత్రికి స్వామివార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఏర్పాట్లను ఈఓ సుధాకర్ పర్యవేక్షించారు.

గుడివాడలో 'ఆమె' కీలకం

అత్యధికంగా పోలైన మహిళా ఓట్లు



ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో ఓటర్లు ఉత్సాహంగా ఓటు వేయడంతో భారీ పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,04,271ఓట్లకు గాను 1,68,537 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 81,119 పురుషులు, 87,408 మహిళలు, 10మంది ఇతరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో పురుషులకన్నా మహిళల ఓట్లు 6,289 ఎక్కువగా ఉన్నాయి. గుడివాడ నియోజకవర్గంలో మొత్తం 82.51శాతం నమోదైంది. కాగా 2019 ఎన్నికల్లో 80.60 శాతం పోలింగ్ నమోదు కాగా ఈ ఎన్నికల్లో 82.51శాతం నమోదైంది. దీంతో ఈ ఎన్నికల్లో 1.91 శాతం పెరగడంతో మహిళలు భారీగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారనే విషయం స్పష్టం అవుతోంది. ఈ విధంగా పెరిగిన పోలింగే గుడివాడలో వైఎస్సార్ సీపీ గెలుపునకు నాందిగా ఉపయోగపడుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే ఉదయం ఆరు గంటలకే ఓటర్లు క్యూలో నిలబడ్డారు. నియోజకవర్గంలో నందివాడ, పట్టణం, గుడివాడరూరల్, గుడ్లవల్లేరు మండలాల వారీగా పరిశీలించగా పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ మంది ఓటు వేశారు.

సంక్షేమ పథకాలకు కృతజ్ఞతగా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలులో మహిళలకే పెద్దపీట వేయడంతో, ఆ పథకాల ద్వారా వచ్చిన ఆర్థిక సాయాలతో కుటుంబాలను మెరుగుపర్చుకున్నారు. దీంతో వారి జీవితాలు మెరుగుపడటంతో పాటు ఈ ఎన్నికల్లో మహిళా ప్రభంజనం ఎక్కువగా కృతజ్ఞతా భావంతో ఓటు వేసినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఎక్కువ మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారని వారు పేర్కొన్నారు. అమ్మ ఒడి, ఆసరా, చేయూత తదితర పథకాల ద్వారా ఎంతో మంది లబ్ధిదారులు పేదరికం నుంచి మెరుగైన జీవితం సాగించేందుకు సీఎం జగన్ దోహదపడటంతో మహిళలందరూ వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అన్ని అమలు చేయడంతో సీఎం జగన్‌ను గెలిపించేందుకు మహిళలందరూ కదలి వచ్చారనేది స్పష్టంగా తెలుస్తోంది. సీఎం జగన్ పాలనపై నమ్మకం ఉంచిన ప్రతిఒక్కరూ మరోసారి ఆయనే సీఎం కావాలనే ఉద్దేశంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు భారీగా తరలిరావడమే దీనికి నిదర్శనం.

పెరిగిన పోలింగ్ శాతం

ఈసారి ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతం అభ్యర్థుల్లో గుబులు రేపుతోంది. ముఖ్యంగా ఎన్నడూ లేని విధంగా వృద్ధులు సైతం కొందరు హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మిగిలిన వారు క్యూలో గంటల తరబడి నిలబడి ఓటు వేసేందుకు కూడా వెనుకాడలేదు. పురుష ఓటర్లకు పోటీగా ఉదయం నుంచి రాత్రి వరకు మహిళా ఓటర్లు కూడా పోలింగ్ కేంద్రాల వద్ద గంటల కొద్దీ క్యూలో వేచి ఉండి ఓటువేశారు. దీంతో అభ్యర్థులు ఎవరికి వారు తమకే ఎక్కువ ఓట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ సరళి చూసిన ఎన్నికల విశ్లేషకులు ప్రజలు సంక్షేమానికే పెద్దపీట వేశారని చెబుతున్నారు. ఆ ఓట్లు ఎవరికి మేలు చేస్తాయి అనే సంగతి తెలియాల్సి ఉంది. నియోజకవర్గంలో ఉన్న వృద్ధులు దాదాపు 80 శాతం మేర ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏది ఏమైనా గుడివాడలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగరటం ఖాయంగా పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

చెన్న మల్లికార్జునస్వామి ఉత్సవాలు ప్రారంభం



కల్యాణ మహోత్సవ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ధర్మకర్త నాగేశ్వరరావు

ఎలకుర్రు(పామర్రు): మండలంలోని ఎలకుర్రు గ్రామంలో భక్తుల కొంగు బంగారంగా ఉన్న చెన్న మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయంలో అంకురార్పణ, ధ్వజారోహణం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం కార్యక్రమాలు జరిగాయి. అనంతరం చిన్నాపురం వాస్తవ్యులు జన్ను నారాయణరావు సమర్పించు సిద్దు ఆదంబి సంవాదం నిర్వహించారు. అనంతరం కళాకారులను ఆలయ ధర్మకర్త నాగేశ్వరరావు సత్కరించారు.

20న అవార్డుల ప్రదానోత్సవం

గ్రామంలోని భ్రమరాంబ చెన్నమల్లికార్జున స్వామి వారి కళా వేదికలో విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వ దాత అవార్డుల ప్రదానోత్సవ సభను నిర్వహించనున్నట్లు విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ కార్యదర్శి కాశీనాథుని నాగేశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ రాత్రి ఏడు గంటలకు ఈ సభ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉయ్యూరు ఆర్డీఓ డి.రాజు, ప్రత్యేక అతిథిగా ప్రపంచ రచయితల సంఘం కార్యదర్శి జివి. పూర్ణ చంద్ పాల్గొంటారని తెలిపారు. అవార్డుగ్రహీతలు ధర్మవరానికి చెందిన తోలు బొమ్మల కళాకారులు పద్మశ్రీ దళవాయి చలపతిరావు, ప్రముఖ కవి, రచయిత, చారిత్రిక పరిశోధకులు లగడపాటి సంగయ్య, సైకత శిల్పి ఆకునూరు బాలాజీ వర ప్రసాదరావు, ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు, విజయవాడ ఆంధ్ర పత్రిక కార్యనిర్వాహక సంపాదకురాలు విజయలక్ష్మి, పెడనకు చెందిన ప్రముఖ సంఘ సేవకులు మట్టా రాధా కృష్ణమూర్తికి విశ్వదాత అవార్డులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కేడీబీ దివ్యాంగుల పాఠశాల విద్యార్థుల నాట్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

ఘనంగా వాసవి అమ్మవారి జయంతి



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు



తోట్లవల్లూరులో వాసవి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గుడివాడలో పూజలు నిర్వహిస్తున్న కమలానంద భారతి స్వామి

మొవ్వ: వాసవి అమ్మవారి జయంతిని మొవ్వ గ్రామంలో శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవాన్ని, అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. నందిపాటి వెంకట నాగ రమేష్, వువ్వాడ సురేష్, మాటూరి వెంకటేశ్వరరావు, ఏ జగన్మోహనరావు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

తోట్లవల్లూరు: వాసవి అమ్మవారి జన్మదిన వేడుకలు పురస్కరించుకుని స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం విప్ర నారాయణ ఆధ్వర్యంలో అమ్మవారికి తొమ్మిది రకాల పుష్పాలు, ప్రసాదాలతో శనివారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ తాడికొండ ఉదయ సూర్య సుధాకరరావు, మనోరమ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: స్థానిక విజయవాడరోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి సందర్భంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ఊయల సేవాధికార్యక్రమాలను ఘనంగా చేశారు. ఆలయంలో పూజాధికాలను అ ర్చకులు ముత్తేవి మాధవ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు జాలయ్య, సాయిబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: స్థానిక కైకలూరు రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో వాసవి కన్యకాపరమేశ్వరీ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో మండపారాధన, పంచామృతాలతో అభిషేకం, సువాసిని, కన్యగౌరి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారి అభిషేకాలు, పట్టు వస్త్రాల సమర్పణ, బాలకన్యలకు విశేష పూజలు, 108 మంది సుహాసినితో సహస్రపుష్పార్చన వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కేసరపల్లికి చెందిన కమలానంద భారతి స్వామీజీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విశిష్టతను, త్యాగాలను భక్తులకు వివరించారు. భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, గౌరవాధ్యక్షుడు దుద్దు వెంకటేశ్వరరావు(చిన్నా), ప్రధాన కార్యదర్శి నారాయణ మురళీకృష్ణ, సముద్రాల వెంకట జగ్గారావు, టంగుటూరి వెంకట సుబ్బారావు, ఐతా గోపాలకృష్ణ, మండల మురళీమోహన్, మాటూరి శ్రీనివాస్, శేగు వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి జన్మదినోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు చొప్పర్ల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణమూర్తి, కోశాధికారి సమయమంతుల వీఎస్ఎస్ బసవరాజు పాల్గొన్నారు.

కలిదిండిలో..

కలిదిండి: కలిదిండిలో వైశాఖ మాస శుద్ధ దశమి సందర్భంగా ఆర్యవైశ్యుల కులదేవత వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని వాసవి క్లబ్ కలిదిండి గోల్డ్ అధ్యక్షుడు బత్తుల రఘురామ్, లక్ష్మి దంపతుల గృహంలో శనివారం నిర్వహించారు. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని మహిళలు దర్శించుకున్నారు. కల్యాణి, నీలి మాధవి, నాగకుమారి, నీలి పద్మావతి, పూర లక్ష్మి, బత్తుల లక్ష్మి, మానేపల్లి, పద్మావతి, నార్కెడమిల్లి మంగతాయారు, దేవి, పలివెల రాజేశ్వరి, పావని, మణి పాల్గొన్నారు.

మొవ్వలో ముంచెత్తిన వర్షం



జలమయమైన పెదపూడి-పామర్రు రహదారి



పామర్రులో కురుస్తున్న వర్షం

మొవ్వ: మొవ్వ మండలాన్ని శనివారం వర్షం ముంచెత్తింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎండా కాలంలో వర్షాకాలన్ని తలపించే విధంగా కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఏది ఏమైనా ఈ వర్షం దుక్కులు దున్నుకునేందుకు ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

పామర్రులో..

పామర్రు: పామర్రులో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. పలు పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. స్థానిక అరండాల్‌పేట, చౌదరి పేట, గాంధీ నగరం, గఫార్ సెంటర్, శివాలయం బజారు, బాపూజీ పేట తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు రహదార్లపై నిలిచిపోయింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో వర్షపునీరు నిలిచింది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ముదినేపల్లి రూరల్: విద్యుదాఘాతానికి ఓ యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలపాలైన సంఘటన ముదినేపల్లిలో శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు కోల్‌కత్తాకు చెందిన సైపుల్లా, ముదినేపల్లి శివారు అన్నవరానికి చెందిన బొర్రా బాలసాయి (22) స్థానికంగా రొయ్యల చెరువుపై పనిచేస్తున్నారు. శనివారం ఉదయం విద్యుత్ మోటార్ స్విచ్ వేస్తుండగా సైపుల్లా షాక్‌కు గురయ్యాడు. ఇతడిని కాపాడేందుకు బాలసాయి ప్రయత్నించగా అతడికి కూడా షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందగా, సైపుల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీసుస్టేషన్లో ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదు.

ఉపాధి హామీలో కాలువ మరమ్మతు పనులు



మండవల్లి: మండలంలోని కానుకొల్లులో ఉపాధి హామీ పథకం పనులతో పంట కాలువలో పూడిక తొలగింపు పనులను కూలీలు నిర్వహిస్తున్నారు. ఎంపీఏ ఎస్.నవీన్ మాట్లాడుతూ రూ.8 లక్షలతో ఉపాధి పనులు జరుగుతున్నాయన్నారు. 168 మంది కూలీలు శనివారం పనులు చేశారని తెలిపారు. రైతులకు ఎప్పటి నుంచో అసంపూర్తిగా ఉన్న కాలువ మరమ్మతు పనులు చేపట్టడంతో వారికి సాగునీటి సమస్యలు తీరుతాయన్నారు. చెరువులకు సక్రమంగా నీరు చేరి ప్రజల దాహార్తి తీర్చడమే కాక, పశువులకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం

మండవల్లి: గౌతమ బుద్ధుని బోధనలు మానవాళికి అనుసరణీయమని సామాజిక కార్యకర్త ఎల్ఎస్ భాస్కరరావు, అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శాంతరాజు అన్నారు. 23న గౌతమ బుద్ధుని జయంతిని పురస్కరించుకుని శనివారం మండవల్లిలో వారు మాట్లాడుతూ ఆ మహనీయుడు సూచించిన అహింస, శాంతి, సహనం, ప్రేమ, దయ, కరుణ ప్రతి ఒక్కరికీ ఆచరణీయాలన్నారు.

ఘనంగా రేణుక అంకమ్మ తల్లి సంబరాలు



హనుమంతపురంలో రేణుక అంకమ్మ తల్లి గ్రామోత్సవం



డప్పువాయిద్యాలతో రేణుక అంకమ్మ తల్లి గ్రామోత్సవం

పమిడిముక్కల: మండలంలోని హనుమంతపురంలో శౌంతి వంశస్థుల ఇలవేల్పు రేణుక అంకమ్మతల్లి సంబరాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. డప్పువాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. ఆదివారం అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకొంటారని కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చే శౌంతి కుటుంబ సభ్యులకు ఆలయం వద్ద అల్పాహారం, భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి



నార్తువల్లూరు ఆరోగ్య ఉపకేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న పద్మావతి

తోట్లవల్లూరు: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఏపీ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ కె.పద్మావతి సూచించారు. స్థానిక నార్తువల్లూరు ఆరోగ్య ఉపకేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. భవనం అధ్వానస్థితిని, పగుళ్లను పద్మావతి పరిశీలించారు. రికార్డులు పరిశీలించటంతోపాటు మందుల నిల్వల గురించి ఆరా తీశారు. భవనం మరమ్మతులపై జిల్లా అధికారులకు లేఖ రాస్తామని చెప్పారు. పీహెచ్ఎన్ పద్మావతి, ఎంపీహెచ్ఎస్ అనిల్‌కుమార్, ఏఎన్ఎం కమలాక్షి పాల్గొన్నారు.

సర్వ మానవాళికి దేవత కన్యకా పరమేశ్వరి అమ్మవారు



విలేకరులతో మాట్లాడుతున్న రామకృష్ణారావు

గుడివాడ టౌన్: శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు సర్వమానవాళికి దేవత అని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామకృష్ణారావు అన్నారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలకు విచ్చేసిన ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. సమాజంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు వైశ్య సామాజిక వర్గానికి దేవత అనే నానుడి ఉందని, అది సరికాదన్నారు. సుమారు 4,500 సంవత్సరాల పైబడి దేవతగా కొలువబడుతున్న అమ్మవారు కేవలం ఒక సామాజిక వర్గానికో, ఒక తెగకో చెందినవారు అనుకోవద్దన్నారు. సర్వలోక మానవాళి సంక్షేమం కోరి అందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్న దైవశక్తి శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, కార్యదర్శి ఎస్. వెంకట జగ్గారావు, టి. వెంకట సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం యువజన నాయకుడు కూరెళ్ల శ్యామ్‌సుందర్, ఎక్కల మణిదీప్, టి. సుబ్బారావు, పైడి గోపి పాల్గొన్నారు.

గీతా పఠనంలో ప్రతిభతో బంగారు పతకాలు



శివలక్ష్మి కుటుంబ సభ్యులను అభినందిస్తున్న దత్తపీఠం ఉత్తరాధికారి విజయానంద తీర్థ స్వామీజీ

తోట్లవల్లూరు: భగవద్గీత పఠనంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన మాదిరాజు శివలక్ష్మి, ఆమె భర్త శ్రీనివాసశర్మ మైసూరు దత్తపీఠం నుంచి ప్రశంసలతోపాటు బంగారు పతకాలు అందుకున్నారు. రెండున్నర దశాబ్దాలుగా భగవద్గీతను భావితరాలకు అందిస్తున్న మండలంలోని యాకమూరుకు చెందిన శివలక్ష్మి, శ్రీనివాసశర్మ మైసూరు దత్తపీఠం నిర్వహించిన పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో దత్తపీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా శివలక్ష్మి, శ్రీనివాసశర్మ శనివారం ప్రశంసాపత్రాలు, బంగారు పతకాలు అందుకున్నారు. బాల్యం నుంచి భగవద్గీత శ్లోకాలను నేర్చుకున్న శివలక్ష్మి నేటికీ అనేక మందికి గీతా పఠనంపై శిక్షణ ఇస్తున్నారు. స్థానికులతోపాటు దేశ, విదేశాలలో ఉన్న వారికి కూడా ఆన్‌లైన్‌లో శిక్షణ కొనసాగిస్తున్నారు. శివలక్ష్మి కుమార్తె బిందు దత్తశ్రీ కూడా గీతా శ్లోకాలను తల్లి వద్ద నేర్చుకుని అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపటంతో పాటు గతంలోనే బంగారు పతకం సాధించింది. గీతా పఠనంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న శివలక్ష్మి కుటుంబాన్ని పలువురు గ్రామస్తులు అభినందించారు.

22న శాంతి కల్యాణోత్సవం

పెడన: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ శ్యామలాంబ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 22న స్వామి వారి శాంతి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో టీవీవీ మోహనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు జరిగే ఈ కల్యాణోత్సవాన్ని కొసనం నాగచైతన్య, చంద్రరేఖ దంపతులచే జరుపబడునని, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాల్సిందిగా ఆయన కోరారు.